# వరంగల్ వాయిస్
Evening Daily

సంపుటి : 04 | సంచిక : 97
పేజీలు : 08 | వెల: రూ.5/-
శుక్రవారం
జనవరి 03, 2025
www.epaper.warangalvoice.net | www.warangalvoice.net




సేవాదనుడు..
## ఆకారపు హరీష్ కుమార్ గుప్త

- జనహితం..ఆయన అభిమతం
- సేవకు ప్రతిరూపం..
- దానధర్మాలకు పెట్టింది పేరు
- వ్యాపార రంగంలోనూ అందెవేసిన చేయి

7లో..

# నిరాశలో.. ఆశావహులు





- ఊరిస్తున్న మంత్రివర్గ విస్తరణ
- ఉలుకూ.. పలుకూ లేని ప్రభుత్వం
- ఏడాదైనా కనికరించని కాంగ్రెస్ అధిష్ఠానం
- కొత్త ఏడాదిలోనూ తప్పని ఎదురు చూపులు

రాష్ట్రంలో మంత్రి వర్గ విస్తరణ మూడు అడుగులు ముందుకు, ఆరడుగులు వెనక్కి అన్న చందంగా మారింది. ప్రజా పాలన పేరుతో అధికారం చేపట్టిన కాంగ్రెస్ పార్టీ సంవత్సరం పూర్తయినా మంత్రి వర్గ విస్తరణ చేపట్టకపోవడంతో ఆశావహుల్లో ఆందోళన నెలకొంటోంది. కీలకమైన శాఖలన్నీ సీఎం రేవంత్ రెడ్డి వద్దే ఉండటంతో పాలన పడకేసింది. గత కొన్ని నెలలుగా విస్తరణపై ఊహాగానాలు కొనసాగుతున్నా అమలుకు మాత్రం నోచుకోవడం లేదు. డిసెంబర్ చివరిలోగా విస్తరణ జరుగుతుందంటూ మంత్రులు సైతం ప్రకటనలు చేసినా కార్యరూపం దాల్చలేదు. అయితే విస్తరణకు మరింత ఆలస్యం అయ్యే అవకాశాలు కన్పిస్తున్నాయి. కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ ప్రస్తుతం విదేశీ పర్యటనలో ఉండటం, ఈ నెల మూడో వారంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సైతం విదేశీ పర్యటనకు వెళ్లటం, ఆ తర్వాత ఫిబ్రవరిలో బడ్జెట్ సమావేశాలు ఉన్నాయి. ఈ నేపథ్యంలో జనవరిలో మంత్రివర్గ విస్తరణకు అవకాశాలు తక్కువేనని కాంగ్రెస్ ముఖ్యనేతలు అభిప్రాయపడుతున్నారు. అయితే ప్రతి పనికి ఢిల్లీ అధిష్ఠానంపై ఆధారపడటాన్ని పార్టీ శ్రేణులు వ్యతిరేకిస్తున్నారు. స్థానిక అవసరాల దృష్ట్యా ఇక్కడే నిర్ణయాలు తీసుకునే వెసులుబాటు కల్పించాలంటున్నారు.

-వరంగల్ వాయిస్, వరంగల్ ప్రతినిధి



వివరాలు2లో..



8లో..

## స్త్రీజాతి విముక్తి కోసం పోరాడిన ధీరవనిత.. సావిత్రీబాయి ఫూలే

- దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ
- స్వగృహంలో పుష్పాంజలి ఘటించిన మంత్రి

# నాణ్యత ప్రమాణాలు పాటించాలి

- నగర మేయర్ గుండు సుధారాణి
- ప్రతాపరుద్ర ఫిల్టర్ బెడ్ ఆకస్మిక తనిఖీ



2లో..


## ఉద్యోగ విరమణ ఆత్మీయ అభినందన సభ



స్నేహశీలి, ప్రతిభాశాలి, కర్తవ్యదీక్ష పరాయణుడు, నిగర్వి
**శ్రీ గొట్టిముక్కుల సదానందం గారు**
తహశీల్దార్, వెంకటాపూర్

తేది : 05 జనవరి 2025 ఆదివారం
సమయం : ఉ॥ 11-00 గంటల నుండి...
వేదిక : KR గార్డెన్స్, దేశాయిపేట్ రోడ్, వరంగల్.

ఇట్లు:
కూతురు-అల్లుడు: స్వర్గం దివ్య-డా॥ జయప్రకాష్
కుమారులు-కోడళ్ళు: గొట్టిముక్కుల దినేష్-దివ్య, శశాంక్-భార్గవి
మనుమలు : మ్రిన్మయ్ క్రితిక్, స్నేహాన్ష్ క్రితిక్, డుగ్గు
మరియు కుటుంబ సభ్యులు



# నిరాశలో.. ఆశావహులు

- ఊరిస్తున్న మంత్రివర్గ విస్తరణ
- ఉలుకూ..పలుకూ లేని ప్రభుత్వం
- ఏడాదైనా కనికరించని కాంగ్రెస్ అధిష్ఠానం
- కొత్త ఏడాదిలోనూ తప్పని ఎదురు చూపులు

**వరంగల్ వాయిస్, వరంగల్ ప్రతినిధి :** రాష్ట్రంలో పది సంవత్సరాల తర్వాత కాంగ్రెస్ పార్టీ అధికారాన్ని చేపట్టింది. ముఖ్యమంత్రిగా రేవంత్ రెడ్డితోపాటు మరో 11 మంది మంత్రులుగా ప్రమాణ స్వీకారం చేశారు. వీరితోపాటు మరో ఆరుగురిని మంత్రిమండలిలోకి తీసుకునేందుకు రాష్ట్ర ప్రభుత్వానికి అవకాశం ఉంది. అయితే మంత్రి వర్గ విస్తరణ రేపు మాపు ఉంటుందంటూ ఏడాదికాలం గడిపారు తప్ప ఇప్పటివరకూ ఎలాంటి ప్రకటనా చేయలేదు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఢిల్లీకి ఎన్ని చక్కర్లు కొట్టినా మోక్షం కలగడం లేదు. ఆయన అభ్యర్థనలను అధినేతలు పెద్దగా పట్టించుకోవడం లేదు. త్వరలో మంత్రివర్గ విస్తరణ అంటూ వార్తలు రావడం..టీవీ సీరియల్‌ను తలపిస్తున్నాయని ఆ పార్టీ నేతలే గుసగుసలాడుకోవడం గమనార్హం.

### పెరుగుతున్న పోటీ..

మంత్రి పదవిని ఆశిస్తున్న వారంతా కళ్లలో వత్తులు వేసుకుని ఎదురు చూస్తున్నారు. తెలంగాణ రాష్ట్రం సిద్ధించిన తర్వాత తొలిసారి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ పార్టీలో సీనియర్ నేతలు ఎవరికి వారు తీవ్రంగా ప్రయత్నాలు చేస్తున్నారు. ఏడాదిగా ఇదే విషయమై ఢిల్లీ దాకా పైరవీలు చేస్తున్నారు. రోజుకొకరు తెర మీదికి వచ్చి మంత్రి పదవిని ఆశిస్తున్న నేపథ్యంలో పోటీ రోజురోజుకూ పెరుగుతోంది. ఆశించడం తప్పేం కాదన్నట్లుగా ఏఐసీసీ దాకా మంత్రి పదవి కోసం ఎమ్మెల్యేలు కాని వారు కూడా దరఖాస్తు చేసుకోవడం గమనార్హం. దీంతో మొదటి జాబితాలోనే పేరున్న వారిలో ఈ కొత్త పరిణామాలు ఒకింత ఇబ్బందికి గురి చేస్తున్నాయి.

### కులాల ప్రాతిపదికన..

చూస్తుండగానే ఏడాది కాలం కరిగి పోయింది. ప్రభుత్వం వస్తే పదవి గ్యారంటీ అని కొందరు మొదట్నుంచి ఆశగా ఎదురు చూస్తున్నారు. కానీ అందుకు విరుద్ధమైన పరిస్థితి ఇప్పుడు ఎదురవుతోంది. ఏకంగా దళిత సామాజిక వర్గం కోటాలో తనకు మంత్రి పదవి దక్కుతుందని ప్రచారం చేస్తుండగా మరొకరు తమ సామాజిక వర్గానికి మంత్రి వర్గంలో అవకాశం కల్పిస్తారంటూ చెప్పుకొస్తున్నారు. ఇలా ఎవరికి వారు మంత్రి పదవి కోసం పోటీ పడడంతో రాజకీయం రసవత్తరంగా మారింది. 2024 సంక్రాంతి నుంచి మొదలైన ఈ పోటీ 2025 సంక్రాంతి వస్తున్నా ముగింపు కార్డు మాత్రం పడలేదు. అసలు మంత్రి వర్గ విస్తరణ ఉంటుందా అనేది జవాబు లేని ప్రశ్నగా మిగిలింది.

### ఆశావహులు వీరే..

మంత్రి పదవులు ఆశిస్తున్న ఎమ్మెల్యేల జాబితా మాత్రం చాంతాడంత ఉంది. ఇందులో రెడ్డి, వెలమ సామాజిక వర్గాలకు చెందిన వారు ఎక్కువగా ఉండడంతో సామాజిక సమతుల్యత పాటించడం కాంగ్రెస్ పార్టీకి తలనొప్పిగా మారింది. దానిని అధిగమించేందుకు నాయకులు పలు మార్లు మేధోమథనం జరిపినా కూడా ఏకాభిప్రాయం రాలేదని పార్టీ నాయకులు చెబుతున్నారు. మంత్రి పదవులను ఆశిస్తున్న ఎమ్మెల్యేలలో కడియం శ్రీహరి, సుదర్శన్ రెడ్డి, మల్‌రెడ్డి రంగారెడ్డి, ప్రేమసాగర్ రావు, మదన్ మోహన్ రావు, కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి, పరిగి రామ్మోహన్ రెడ్డి, గడ్డం వివేక్, శ్రీహరి ముదిరాజ్, బాలునాయక్, రామచంద్రనాయక్ ఉన్నారు. ఎమ్మెల్సీలు అమిర్ అలీఖాన్, కోదండ రాం తదితరులు పోటీ పడుతున్నారు. ఖాళీ ఉన్న ఆరింటిని భర్తీ చేసినా కూడా మంత్రి పదవులు రాకుండా మిగిలే వారెక్కువ ఉన్నారు. మంత్రి మండలిలో అవకాశం దక్కని వారికి డిప్యూటీ స్పీకర్, చీఫ్ విప్, ఆర్టీసీ, పౌరసరఫరాలు, మూసి అభివృద్ధి ఆథారిటీ చైర్మన్ వంటి నామినేటెడ్ పదవులను ఇచ్చి సంతృప్తి పరచాలని అధిష్ఠానం భావిస్తున్నట్లు తెలుస్తోంది. అయితే ముహూర్తం మాత్రం ఎప్పుడన్నది తేలడం లేదు.

# ‘ఆరోగ్యదర్శి’ని వార్షికోత్సవ సంచిక ఆవిష్కరణ



**వరంగల్ వాయిస్, హనుమకొండ :** ఆరోగ్యదర్శిని 10వ వార్షికోత్సవ సంచికతోపాటు నూతన సంవత్సర క్యాలెండర్ ను హనుమకొండ జేఎన్ఎస్ స్టేడియంలో తెలంగాణ బ్యాడ్మింటన్ అసోసియేషన్ అధ్యక్షుడు బొద్దిరెడ్డి ప్రభాకర్ రెడ్డి, సీనియర్ జర్నలిస్ట్, వరంగల్ ప్రెస్ క్లబ్ పూర్వ అధ్యక్షుడు గడ్డం కేశవమూర్తి ఆవిష్కరించారు. అనంతరం కేక్ కట్ చేసి నూతన సంవత్సర వేడుకలు జరుపుకున్నారు. ఈ సందర్భంగా ప్రభాకర్ రెడ్డి మాట్లాడుతూ ప్రముఖ హోమియో వైద్యుడు డాక్టర్ పావుశెట్టి శ్రీధర్ ఆధ్వర్యంలో ఆరోగ్యదర్శిని పక్షపత్రిక పదేళ్లుగా నిర్విరామంగా వెలువరించడం అభినందనీయమన్నారు. అలాగే ఉచిత హోమియో క్యాంపులు నిర్వర్తిస్తూ ప్రజలకు హోమియోపతిపై అవగాహన కల్పించడంలో విశేష కృషి చేస్తున్నారన్నారు. ఈ కొత్త సంవత్సరంలో ప్రతి ఒక్కరూ ఆరోగ్యంగా ఉండాలని ఆకాంక్షించారు. అనంతరం గడ్డం కేశవమూర్తి మాట్లాడుతూ ఒకవైపు వైద్యం చేస్తూనే మరొకవైపు ఆరోగ్య దర్శిని పక్షపత్రికను 10 సంవత్సరాలుగా కొనసాగించడం హర్షణీయమన్నారు. ఇటువంటి ఆరోగ్య సమాచార పత్రిక డాక్టర్ శ్రీధర్ సంపాదకత్వంలో మన వరంగల్ నుంచి వెలువడడం గొప్ప విషయమన్నారు. అనంతరం ఆరోగ్య దర్శిని పక్షపత్రిక ఎడిటర్ డాక్టర్ పావుశెట్టి శ్రీధర్ మాట్లాడుతూ ప్రస్తుత ప్రపంచమంతా ఆరోగ్యం గురించి పరితపిస్తూ అనారోగ్యం గురించి కలత చెందుతున్నారన్నారు. నేడు వస్తున్న వ్యాధులకు రూ.వేల నుంచి లక్షలు ఖర్చు అయినా కూడా కొన్ని సమస్యలు నయం కావడం లేదన్నారు. ఇప్పుడిప్పుడే ప్రజలు ప్రత్యామ్నాయ మార్గం గురించి అన్వేషిస్తున్నారన్నారు. ప్రజా శ్రేయస్సును కాంక్షిస్తూ ఆరోగ్యంపై అవగాహన కల్పించాలనే లక్ష్యంతో ఈ ఆరోగ్య దర్శిని పక్షపత్రికను నడపడం జరుగుతుందన్నారు. ఈ ప్రయాణంలో సహకరిస్తున్నటువంటి పాఠకులకు, మిత్రులకు ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో పూజారి విజయ్, దేవేందర్ రెడ్డి, మహేందర్ రెడ్డి, పి.విజయ్, రాజు ప్రసాద్, రాజు, వెంకట్, రాజేందర్, సతీష్, సంతోష్, కోమాకుల మధు, కోచ్ కూరపాటి రమేష్, పెరుమాండ్ల వెంకట్, రాజు, కృష్ణ, రాజిరెడ్డి, మోహన్ రావు, భిక్షపతి, శశి, చంటి తదితరులు పాల్గొన్నారు.



# ‘అనిత’ టీచర్ ఔనత్యం

## సొంతంగా విద్యార్థుల పరిక్ష ఫీజు చెల్లింపు

**వరంగల్ వాయిస్, డోర్నకల్ :** డోర్నకల్ మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఈ సంవత్సరం పదో తరగతి వార్షిక పరీక్షలు రాస్తున్న 17 మంది విద్యార్థులకు సంబంధించిన పరీక్ష ఫీజును ఉపాధ్యాయురాలు కలపాల అనిత చెల్లించారు. ఇటీవల కురవి జిల్లా పరిషత్ పాఠశాల నుంచి పదోన్నతిపై ఇక్కడికి వచ్చిన ఆమె పాఠశాలలో హిందీ భాషను బోధిస్తున్నారు. అయితే ఈ ఏడాది పదో తరగతి పరీక్షలు రాస్తున్న పేద విద్యార్థులను గుర్తించి 17 మందికి తన సొంత ఖర్చులతో పరీక్ష ఫీజు చెల్లించారు. ప్రతి విద్యార్థికి రూ.200 చొప్పున సుమారు రూ.3,500 పాఠశాల ప్రధానోపాధ్యాయులు నరసింహారావు, సెక్రెటరీ అప్పిరెడ్డిలకు అందించారు. ఆర్థిక పరిస్థితులను గ్రహించి తమ ఫీజులను చెల్లించిన ఉపాధ్యాయురాలికి విద్యార్థులు కృతజ్ఞతలు తెలిపారు. అనిత టీచర్ ఔనత్యాని పలువురు ఉపాధ్యాయులు అభినందించారు.



# పండిత పరిషత్ ఆధ్వర్యంలో.. గురువులకు సన్మానం

**వరంగల్ వాయిస్, కరీమాబాద్ :** రాష్ట్రీయ ఉపాధ్యాయ పండిత పరిషత్ వరంగల్ జిల్లా శాఖ ఆధ్వర్యంలో శుక్రవారం వరంగల్ జిల్లాలోని 37మంది ఉత్తమ ఉపాధ్యాయులకు సావిత్రిబాయి పూలే అవార్డు ప్రధానం చేయడం జరిగింది. ఈ కార్యక్రమానికి గంగదేవిపల్లి ప్రధానోపాధ్యాయులు మహమ్మద్ రజాక్ జిల్లా అధ్యక్షులు అంకేశ్వరపు కుమారస్వామి అధ్యక్షత వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఆర్ యూపీపీ రాష్ట్ర అధ్యక్షులు మహమ్మద్ అబ్దుల్లా హాజరై మాట్లాడుతూ మహిళలు కష్టపడి ఉన్నత శిఖరాలు అధిరోహిస్తున్నారని మహిళా శక్తికి ఈ కార్యక్రమం నిదర్శనమని అన్నారు. మహిళా ఉపాధ్యాయుల సంఖ్య పెరుగుతుందని పిల్లల విద్యాభివృద్ధికి మహిళా ఉపాధ్యాయుల ఆవశ్యకత ఎంతో ఉందని అన్నారు. రాష్ట్రీయ ఉపాధ్యాయ పండిత పరిషత్తు వరంగల్ జిల్లా శాఖ ఈ కార్యక్రమాన్ని నిర్వహించడం ఎంతో సంతోషదాయకం అన్నారు. జీసీడీఓ ఫ్లోరెన్స్ ఏఎస్ఓ వేణుగోపాల్, ఆర్ యూపీపీ రాష్ట్ర ప్రతినిధి నాగుల భిక్షపతి, వరంగల్ జిల్లా ప్రధాన కార్యదర్శి వనం సదానందం, కోశాధికారి మంద రవీందర్, రాష్ట్ర ప్రతినిధి రాపాల అశోక్, వరంగల్ ఉమ్మడి జిల్లా బాధ్యులు సొల్లేటి లక్ష్మీనారాయణ, గౌరవ అధ్యక్షులు జక్కం దామోదర్, బీఎస్ఐ వరంగల్ జిల్లా అధ్యక్షులు ఎలగొండ రాములు, మండల అధ్యక్షుడు సాగర్, గంగదేవిపల్లి విద్యా పరిరక్షణ సమితి అధ్యక్షులు బాబన్న, జిల్లా మహిళా ఉపాధ్యక్షురాలు వినోద, వివిధ జిల్లాల నుంచి మహిళా ఉపాధ్యాయులు హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

# నాణ్యత ప్రమాణాలు పాటించాలి

- నగర మేయర్ గుండు సుధారాణి
- ప్రతాపరుద్ర ఫిల్టర్ బెడ్ ఆకస్మిక తనిఖీ


**వరంగల్ వాయిస్, కాశిబుగ్గ :** నగర ప్రజలకు నాణ్యమైన తాగునీటిని అందించాలని నగర మేయర్ గుండు సుధారాణి ఆదేశించారు. దేశాయిపేటలో బల్దియా నిర్వహిస్తున్న ప్రతాపరుద్ర ఫిల్టర్ బెడ్ ను శుక్రవారం మేయర్ ఆకస్మికంగా తనిఖీ చేసి నీటి శుద్ధీకరణ తీరును, నీటి నాణ్యతను పరిశీలించారు. ఈ సందర్భంగా ఫిల్టర్ బెడ్ లో కలియ తిరిగిన మేయర్ నీటిని శుభ్రం చేసే క్రమాన్ని అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఫిల్టర్ బెడ్ మరమ్మత్తు పనులకు రూ.కోటి మంజూరు చేసినందున టెండర్ ప్రక్రియను వేగవంతంగా పూర్తి చేసి వెంటనే పనులను ప్రారంభించాలన్నారు. వేసవి మొదలుకాక ముందు పనులను పూర్తి చేసి నగర ప్రజలకు స్వచ్ఛమైన తాగునీటిని అందించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్సీ ప్రవీణ్ చంద్ర, ఈఈ శ్రీనివాస్, డీఈ రంగనాథ్ తదితరులు పాల్గొన్నారు.

# తెలంగాణ అవేట్న్యూ వీడియో చిత్రంలో కోటగుళ్లు, గణప సముద్రం

**➲ చిత్రాన్ని నిర్మించిన పర్యాటశాఖకు కోటగుళ్ల పరిరక్షణ కమిటీ కృతజ్ఞతలు**



**వరంగల్ వాయిస్, గణపురం :** తెలంగాణ అవేట్న్యూ వీడియో చిత్రంలో పర్యాటక అందాలు, వారసత్వ కట్టడాలుగా పేరొందిన కాకతీయుల గణపురం కోటగుళ్లు, గణప సముద్రాలకు రాష్ట్ర పర్యాటక శాఖ చోటు కలిగించినందుకు గణపురం కోటగుళ్లు పరిరక్షణ కమిటీ శుక్రవారం ఒక ప్రకటనలో హర్షం వెలిబుచ్చింది. రామప్ప దేవాలయం, భూదాన్ పోచంపల్లి, యాదగిరిగుట్ట ఆలయం, పాండవుల గుట్ట, నాగార్జునసాగర్, జోడేఘాట్ లోయ, నల్లమల అమ్రాబాద్ టైగర్ రిజర్వ్, కిన్నెరసాని వైల్డ్ లైఫ్ సాంక్చురి, ప్రాజెక్టు కొమురం భీం



ప్రాజెక్టు, ఎస్సారెస్పీ(నందిపే), బ్యాక్ వాటర్స్ తెలంగాణ అవేట్న్యూ వీడియో చిత్రంలో ఉన్నాయని, వాటి సరసన గణపురం కోటగుళ్లు (గణపేశ్వరాలయ సముదాయం), గణప సముద్రాలను వీడియో చిత్రంలో నిలిపి వాటి ఖ్యాతిని మరింత పెంపొందిస్తున్నందుకు పర్యాటక శాఖను కొనియాడింది. ప్రపంచ నలుమూలల నుంచి పర్యాటకులను ఆకర్షించడమే లక్ష్యంగా పైన పేర్కొన్న ప్రదేశాల ప్రకృతి, పర్యాటక అందాలు వారసత్వ కట్టడాలను అద్భుతంగా చూపిన ఆ వీడియో చిత్రం పర్యాటకులను ఎంతగానో అలరింప చేస్తున్నందుకు పర్యాటక శాఖకు గణపురం కోటగుళ్ల పరిరక్షణ కమిటీ కృతజ్ఞతలు తెలిపింది.

# పీఆర్టీయూ క్యాలెండర్ ఆవిష్కరణ




**వరంగల్ వాయిస్, నడికూడ :** మండల పీఆర్టీయూ శాఖ అధ్యక్షుడు అచ్చ సుదర్శన్, ప్రధాన కార్యదర్శి కటుకోజ్వాల సతీష్ ఆధ్వర్యంలో నడికూడ మండల కేంద్రంలోని ఉన్నత పాఠశాలలో క్యాలెండర్ ఆవిష్కరణ చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా మండల విద్యాశాఖ అధికారి హనుమంతరావు, హనుమకొండ జిల్లా పీఆర్టీయూ ప్రధాన కార్యదర్శి పలిత శ్రీహరి హాజరయ్యారు. ఈ సందర్భంగా మండల విద్యాశాఖ అధికారి మాట్లాడుతూ ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించడంలో పీఆర్టీయూ సంఘం ముందుంటుందని అన్నారు. జిల్లా ప్రధాన కార్యదర్శి పలిత శ్రీహరి మాట్లాడుతూ ఉపాధ్యాయులకు రావాల్సిన బకాయిలను చెల్లించే విధంగా జిల్లా శాఖ, రాష్ట్ర శాఖ పనిచేస్తుందని, త్వరలో పీఆర్సీ ఇప్పించడానికి కృషి చేస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షులు గొట్టేముక్కుల శ్రీనివాస్ రెడ్డి, మోడెం రాజేందర్ బాబు, నన్నేసాహెబ్, రాష్ట్ర బాధ్యులు బురుగు శంకర్, బాలాజీ, జిల్లా బాధ్యులు శరత్ గౌడ్, బేబీ రాణి, సురేష్, ఉపాధ్యాయులు మాధవి, జయ, జోష్న శారద, రాజు, లింగమూర్తి, జగదీశ్వర్, తిరుపతి, శ్రావణ్ కుమార్, శివకుమార్, కుమారస్వామి పాల్గొన్నారు.

# ప్రజల అభివృద్ధే కాంగ్రెస్ ప్రభుత్వం లక్ష్యం

## ఎమ్మెల్యే భూక్యా మురళీ నాయక్



**వరంగల్ వాయిస్, మహబూబాబాద్ :** మున్సిపల్ పరిధిలోని 13వ వార్డు రామచంద్రపురంలో సీసీ రోడ్డు పనులకు శుక్రవారం స్థానిక ఎమ్మెల్యే డాక్టర్ భూక్యా మురళీ నాయక్ శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే డా.మురళి నాయక్ మాట్లాడుతూ ప్రజా ప్రభుత్వంలో ప్రజల నిర్ణయాలకే అధిక ప్రాధాన్యత ఇస్తున్నామని తెలిపారు. అన్ని రకాలుగా అభివృద్ధి చేయడమే తమ లక్షమని పేర్కొన్నారు. నిర్ణీత కాలంలో నిర్మాణ పనులను పూర్తి చేయాలని, నిర్మాణంలో కాంట్రాక్టర్లు నాణ్యత ప్రమాణాలు పాటించాలని సూచించారు. పట్టణ ప్రాంతాల అభివృద్ధికి తమ వంతు కృషి చేస్తానని ఎమ్మెల్యే డా.మురళీ నాయక్ హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో బొజ్జ వెంకన్న, మున్సిపల్ చైర్మన్, వైస్ చైర్మన్, వార్డ్ కౌన్సిలర్లు, జిల్లా నాయకులు, పట్టణ నాయకులు, అధికారులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# డివైడర్, సెంటర్ లైట్లు వేయాలి



**వరంగల్ వాయిస్, మహబూబాబాద్ :** పట్టణంలోని నెహ్రూ సెంటర్ నుంచి మంగళి కాలనీ వరకు రోడ్డు పూర్తి చేసి డివైడర్, సెంటర్ లైట్లను వేయాలని సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు, మున్సిపల్ ఫ్లోర్ లీడర్ సూర్నపు సోమయ్య డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా స్థానిక మున్సిపల్ డీఈని టూ టౌన్ కమిటీ ఆధ్వర్యంలో కలిసి వినతి పత్రం అందజేశారు. సీపీఎం మున్సిపల్ ఫ్లోర్ లీడర్ కామ్రేడ్ సూర్నపు సోమయ్య ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడుతూ గతంలో నెహ్రూ సెంటర్ నుంచి పత్తిపాక, మంగళి కాలనీ, రాజలిపేట వరకు 80 ఫీట్ల రోడ్డు ప్రతిపాదనలో ఉందని, రోడ్డు వైపు ఉన్న పేదల ఇండ్లను కూల్చారు. పెద్దోళ్ల ఇండ్లను ఆపి, తరువాత 66 ఫీట్లకు కుదించినట్లుగా చెప్పి మరికొందరి ఇండ్లను కూల్చారు. ఇప్పుడు మొత్తంగా 60 ఫీట్ల వరకే రోడ్డు వేస్తూ ధనవంతుల ఇండ్ల వరకే డివైడర్, సెంటర్ లైట్లను వేయడం సరికాదన్నారు. రోడ్డు వెడల్పు అయ్యి డివైడర్, సెంటర్ లైట్లు వస్తే మా ఇండ్లకు విలువ పెరుగుతుందని స్వచ్ఛందంగా రోడ్డు వెడల్పుకు పేద ప్రజలు సహకరించారని అన్నారు. ఇప్పటికైనా నెహ్రూ సెంటర్ నుంచి మంగళి కాలనీ వరకు డివైడర్, సెంటర్ లైట్లను వేయాలని వారు డిమాండ్ చేశారు. లేకుంటే పార్టీ ఆధ్వర్యంలో ప్రజలను సమీకరించి ఆందోళన పోరాటాలు చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో పార్టీ పట్టణ కమిటీ సభ్యులు దేవత్ హేమానాయక్, ఇల్లుటూరి లాలయ్య, మందుల మహేందర్, ఎర్ర శ్రీనివాస్, ఇస్తారీ, శ్యామల వెంకన్న, తోల్లా బాబు రావు తదితరులు పాల్గొన్నారు.

# మానవత్వం చాటుకున్న ఎమ్మెల్యే



**వరంగల్ వాయిస్, తొర్రూరు :** జనగామ జిల్లాలో జరిగిన రోడ్డు ప్రమాద బాధితుల పట్ల పాలకుర్తి శాసన సభ్యురాలు యశస్విని ఝాన్సీ రెడ్డి మానవత్వాన్ని చాటుకున్నారు. హైదరాబాద్ నుంచి పాలకుర్తికి వస్తున్న సమయంలో జనగామ ఫ్లైఓవర్ దగ్గర శుక్రవారం రోడ్డు ప్రమాదం జరిగిందని గమనించిన ఎమ్మెల్యే యశస్విని రెడ్డి తక్షణమే తమ వాహనాన్ని ఆపి క్షతగాత్రులను పరామర్శించారు. ప్రమాదస్థలంలో గాయపడిన వారి వద్దకు వెళ్లి వారి పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. 108 అంబులెన్స్ కు స్వయంగా ఫోన్ చేసి సత్వరమే అక్కడికి చేరుకోవాలని కోరారు. అంబులెన్స్ వచ్చే వరకు ఆమె అక్కడే ఉండి, బాధితులకు తక్షణ అవసరమైన సహాయం అందించారు. క్షతగాత్రులను జనగామ ఏరియా హాస్పిటల్ కు పంపించి, సంబంధిత డాక్టర్లతో మాట్లాడి మెరుగైన వైద్యం అందించాలని ఆదేశించారు. యశస్విని ఝాన్సీ రెడ్డి తనలో ఉన్న మానవతా దృక్పథాన్ని మరోసారి చూపించారు. ప్రజాప్రతినిధిగా మాత్రమే కాకుండా, సమాజానికి అవసరమైనప్పుడు సహాయం చేయడానికి సిద్ధంగా ఉన్నామని నిరూపించారు.

# కళ్యాణి హాస్పిటల్ పై చర్యలు తీసుకోవాలి



**వరంగల్ వాయిస్, తొర్రూరు :** హనుమకొండ నగరంలోని శ్రీదేవి ఏషియన్ హాల్ ముందు ఉన్న కళ్యాణి హాస్పిటల్ ఎదుట శ్రీవిద్య-నవీన్ కుటుంబానికి న్యాయం చేయాలని బాధిత కుటుంబ సభ్యులకు మద్దతుగా నేషనల్ హ్యూమన్ రైట్స్ సోషల్ జస్టిస్ సోషల్ సర్వీస్ ఫర్ చేంజ్ ఆఫ్ ఇండియా వరంగల్ జిల్లా కమిటీ సభ్యులు, జాతీయ అధ్యక్షుడు మంగళపల్లి హుస్సేన్ కమిటీ సభ్యులతో ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా హుస్సేన్ మాట్లాడుతూ హాస్పిటల్ యాజమాన్యం నిర్లక్ష్య వైఖరి వల్లనే బేబీ చనిపోయిందని, దానికి వారు పూర్తి బాధ్యత వహించాలన్నారు. ఈ ధర్నాలో వారి కుటుంబ సభ్యులు ఆశ్రిత, సుప్రియ, రాజు, నడిపెల్లి అశోక్, బంధుమిత్రులు తదితరులు పాల్గొన్నారు.

# బాధిత కుటుంబానికి చెక్కు అందజేత



**వరంగల్ వాయిస్, గీసుగొండ :** మండల కేంద్రానికి చెందిన బీఆర్ఎస్ కార్యకర్త దౌడు బాబు ప్రమాదవశాత్తు ఇటీవల మరణించగా ఆయన భార్య శారదకు కేసిఆర్ ప్రవేశ పెట్టిన పార్టీ సభ్యత్వం రూ.2 లక్షల బీమా చెక్కును పరకాల మాజీ శాసనసభ్యుడు చల్లా ధర్మారెడ్డి శుక్రవారం హనుమకొండలోని ఆయన నివాసంలో అందజేశారు. ఈ సందర్భంగా చల్లా ధర్మారెడ్డి మాట్లాడుతూ దేశంలో ఏ రాజకీయ పార్టీ కూడా కార్యకర్తలకు బీమా సదుపాయం కల్పించలేదన్నారు. మొదటగా బీఆర్ఎస్ పార్టీ సభ్యత్వం పొందిన ప్రతి కార్యకర్తకు బీమా సదుపాయం కల్పించడం జరిగిందన్నారు. పార్టీ కోసం కష్టపడే కార్యకర్త అకాల మరణం చెందితే వారి కుటుంబానికి ఆర్థిక భరోసా కల్పించాలనే సదుద్దేశంతో కేసీఆర్ బీమా సదుపాయం ప్రవేశ పెట్టారని తెలిపారు. అదేవిధంగా పార్టీ పటిష్టత కోసం కృషిచేస్తున్న ప్రతి కార్యకర్తను కంటికి రెప్పలా కాపాడుకుంటానని, వారికి అండగా ఎల్లపుడు ఉంటానని అన్నారు. ఈ కార్యక్రమంలో మండల బీఆర్ఎస్ నాయకులు పోలీస్ ధర్మారావు, చల్లా వేణుగోపాల్ రెడ్డి, పుండ్రు జైపాల్ రెడ్డి, గుర్రం రఘు, బోడకుంట్ల ప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.

# చదువుల తల్లికి నిజమైన సత్కారం

## నవీనయుగ కర్తవ్యపు ఆవిష్కర్తకు పాలాభిషేకం

◆ పాస్ రాష్ట్ర అధ్యక్షుడు సంగని మల్లేశ్వర్



**వరంగల్ వాయిస్, కేయూ :** చదువుల తల్లి సావిత్రిబాయి పూలే జన్మదినం మహిళా ఉపాధ్యాయ దినోత్సవంగా ప్రకటించి, అట్టడుగు వర్గాల పక్షపాతిగా నిలిచిన రేవంత్ ఆశయాలు అనిర్వచనీయమని పూలే ఆశయ సాధన సమితి ( పాస్) రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ సంగని మల్లేశ్వర్ అన్నారు. శుక్రవారం కాకతీయ విశ్వవిద్యాలయంలోని పూలే ప్రాంగణంలో పూలే ఆశయ సాధన సమితి (పాస్) ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన సావిత్రిబాయి 194 జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా డాక్టర్ సంగని మల్లేశ్వర్ హాజరై ముందుగా పూలమాలవేసి, జ్ఞాన జ్యోతికి పుష్పాంజలి ఘటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యతోనే వనితకు విముక్తి సాధ్యమన్న సామాజిక సంస్కర్త, ఆధునిక భారత తొలి మహిళా ఉపాధ్యాయురాలు, బహుజన చైతన్య స్ఫూర్తి , చదువుల తల్లి సావిత్రిబాయి పుట్టిన రోజు మహిళా ఉపాధ్యాయ దినోత్సవంగా జరుపుకోవాలని కాంగ్రెస్ ప్రభుత్వం తీసుకున్న నిర్ణయం చరిత్రాత్మకం అని సీఎం రేవంత్ రెడ్డి చిత్ర పటానికి పాలాభిషేకం చేశారు. వేల సంవత్సరాల వెతల్తో ,వేదనల్తో తెల్లారుతోన్న గరీబు బతుకులు వెనకబడడానికి విద్య లేక పోవడమే కారణమని నాడు మహాత్మా జ్యోతిరావు పూలే తన సతీమణి సావిత్రిబాయి పూలేను మొట్ట మొదటి మహిళా టీచర్ గా తీర్చిదిద్ది, పాఠశాలలు ప్రారంభించి బడుగు, బలహీన వర్గాల జీవితాల్లో విద్యా వెలుగులు నింపారని, అదే స్ఫూర్తితో నేడు దశాబ్ద కాలంగా కమ్ముకున్న దట్టమైన చీకట్లని పటాపంచాలు చేస్తూ సీఎం రేవంత్ జ్ఞాన వెలుగులు మోసుకొచ్చిన సావిత్రిబాయి పూలే పుట్టినరోజు మహిళా ఉపాధ్యాయ దినోత్సవం జరుపుకోవాలని నిర్ణయించడం గొప్ప విషయమన్నారు. అదేవిధంగా కామారెడ్డి డిక్లరేషన్ కాంగ్రెస్ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తే, దామాషా ప్రకారం వివిధ పదవులలో అర్హత గల బడుగులకు అవకాశాలు దక్కుతాయన విశ్వాసాన్ని వ్యక్తం చేశారు. నిస్సందేహంగా సీఎం రేవంత్ నవీనయుగ కర్తవ్యపు ఆవిష్కర్తకు ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ కులాలు జీవితాంతం రుణపడి ఉంటారని తెలిపారు. ఈ కార్యక్రమంలో పాస్ ఉమ్మడి వరంగల్ జిల్లా అధ్యక్షులు డాక్టర్ తాడూరి శాస్త్రి, రాష్ట్ర కార్యదర్శి డాక్టర్ చందా మల్లయ్య, రాష్ట్ర పాస్ నాయకులు ఆచార్య సురేష్ లాల్, ఆచార్య వెంకయ్య, జిల్లా ప్రధాన కార్యదర్శి డాక్టర్ నల్లాని శ్రీనివాస్, డాక్టర్ ఆకుతోట శ్రీనివాస్, డాక్టర్ దడబోయిన శ్రీకాంత్, బొనగాని యాదగిరి గౌడ్, డాక్టర్ వంగాల సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

## సావిత్రి పూలే సేవలు మరువలేనివి



**వరంగల్ వాయిస్, హనుమకొండ :** సావిత్రి బాయి పూలే జయంతిని పురస్కరించుకొని హనుమకొండ రాంనగర్ లోని బీసీ భవన్ లో బీసీ ఇంటెలెక్టుల్ ఫోరం ఆధ్వర్యంలో జయంతి ఉత్సవాలను నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా కుడా మాజీ చైర్మన్, మాస్టర్ జి విద్యా సంస్థల అధినేత సంగంరెడ్డి సుందర్ రాజ్ యాదవ్ ప్రసంగిస్తూ సావిత్రి భాయ్ పూలే సమాజానికి చేసిన సేవలను కొనియాడారు. బండా వివేకానంద అడ్వకేట్ మాట్లాడుతూ అగ్రవర్ణాల అధిపత్యానికి వ్యతిరేకంగా పోరాటం చేసిన వీర మహిళ అని పూలేను అభివర్ణించారు. గంగపురం వేణుమాధవ్ మాట్లాడుతూ ఒక రైతు బిడ్డ గా, బలహీన వర్గాలకు చెందిన మహిళగా తన భర్త జ్యోతి రావు పూలే అందించిన విద్య ఆధారంగా ఈ దేశానికే మొట్ట మొదటి మహిళా ఉఫాధ్యాయురాలిగా ఉండి రాణించారని అన్నారు. ఈ కార్యక్రమంలో గుళ్లపల్లి చిరంజీవ రావు, రాజు, సంయుక్త, గడ్డం భాస్కర్, దినేష్, డాక్టర్ రాజేంద్ర కుమార్, రవి, నాగరాజు, శివ, సరళ, సమతా, వైష్ణవి, ప్రత్యుష పాల్గొన్నారు.

## సామాజిక విప్లవకారిణీ సావిత్రి బాయి పూలే




**వరంగల్ వాయిస్, కేయూ :** కుల, మత, ఆర్థిక, స్త్రీ, పురుష అసమానతలు లేని సమానత్వ సమాజ స్థాపన కోసం సావిత్రిబాయి పూలే స్ఫూర్తితో నేటి విద్యార్థులు ఉద్యమించాలని పీడీఎస్ యూ రాష్ట్ర ఉపాధ్యక్షులు బి.నరసింహారావు పిలుపునిచ్చారు. శుక్రవారం పీడీఎస్ యూ ఆధ్వర్యంలో సావిత్రిబాయి పూలే జయంతిని కాకతీయ యూనివర్సిటీలో ఘనంగా నిర్వహించారు. పోతన హాస్టల్, న్యూ పీజీ హాస్టల్, డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ హాస్టల్, పద్మాక్షి లేడీస్ హాస్టల్ లో ఆమె చిత్రపటానికి పూలు నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో పీడీఎస్ యూ రాష్ట్ర నాయకురాలు కావ్య, కాకతీయ యూనివర్సిటీ నాయకులు బి.బాలకృష్ణ, పి.అనూష, పృథ్వీరాజ్, సాధన, శ్రీజ ,అర్చన, మౌనిక, రమ్య, నరేష్, సతీష్, యాదగిరి, సాయి, సాయికుమార్, పాల్గొన్నారు.

## ఉర్సు శ్రీ వేంకటేశ్వర పాఠశాలలో..



**వరంగల్ వాయిస్, వరంగల్ :** శ్రీ వేంకటేశ్వర ఉన్నత పాఠశాల ఉర్సు వరంగల్ లో సావిత్రి భాయి పూలే జయంతిని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల పాలకవర్గ అధ్యక్షులు, స్థానిక కార్పొరేటర్ మరుపల్ల రవి పాల్గొని పాఠశాలలోని మహిళా ఉపాధ్యాయ సిబ్బందిని ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు చిట్యాల సోమశేఖర్, పాలకవర్గ కార్యదర్శి యేర కోటేశ్వర్, ఉపాధ్యాయినులు ప్రతిభ, ఉమాదేవి, రాణి, సుమలత, లలిత, సవితలను ఘనంగా సత్కరించారు. ఉపాధ్యాయులు ఎండీ దావూద్, కృష్ణమూర్తి, తిరుపతి రెడ్డి, బోధనేతర సిబ్బంది పాల్గొన్నారు.

## సావిత్రి బాయి ఆశయాలను కొనసాగించాలి




**వరంగల్ వాయిస్, పరకాల :** దేశంలోనే మొదటి మహిళా అధ్యాపకురాలిగా, మహిళల అభివృద్ధి కోసం ఎనలేని కృషి చేసిన సావిత్రిబాయి పూలే ఆశయాలను కొనసాగించాలని పరకాల ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ కె.సంపత్ కుమార్ అన్నారు. సావిత్రి బాయి పూలే జయంతి సందర్భంగా పరకాల ప్రభుత్వ జూనియర్ కళాశాలలో కళాశాల మహిళా అధ్యాపకులు విద్యార్థులతో కలిసి ఆయన, సావిత్రిబాయి పూలే చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కళాశాల మహిళా అధ్యాపకులు మాధవి, రమాదేవి, భవాని, పద్మ, జ్యోతి, తిరుమల, విద్యార్థులు పాల్గొన్నారు.

## హనుమకొండ రెడ్ క్రాస్ సొసైటీలో..




**వరంగల్ వాయిస్, హనుమకొండ :** సావిత్రిబాయి పూలే జయంతిని పురస్కరించుకొని శుక్రవారం హనుమకొండ రెడ్ క్రాస్ సొసైటీ కార్యాలయంలో సావిత్రిబాయి పూలే చిత్ర పటానికి రెడ్ క్రాస్ సొసైటీ చైర్మన్, పాలకవర్గ సభ్యులు పూలమాల వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా రెడ్ క్రాస్ సంస్థ చైర్మన్ మాట్లాడుతూ తెలంగాణ ప్రభుత్వం ఈ పర్వదినాన్ని మహిళా ఉపాధ్యాయ దినోత్సవంగా అధికారికంగా ప్రకటించడం శుభసూచకమన్నారు. భారతీయ సమాజంలో అసమానతల మీద అలుపెరుగని పోరాటం చేసిన సంఘసంస్కర్త, ఉపాధ్యాయుని, రచయిత్రి సావిత్రిబాయి పూలే అని తెలిపారు. పూలే భారతదేశ మొట్టమొదట మహిళా ఉపాధ్యాయురాలని, మహిళా జాతి అభ్యున్నతికి, స్త్రీ శక్తికి మారుపేరు సావిత్రిబాయి పూలే, ప్రముఖ సంఘసంస్కర్త అయిన ప్రముఖ జ్యోతిరావు పూలే భార్య, మహిళా జాతి అభ్యున్నతికి, స్త్రీ శక్తికి మారుపేరు సావిత్రిబాయి పూలే అన్నారు. వారి ఆదర్శాలను కొనసాగిస్తూ స్త్రీ జాతి సంపూర్ణ సాధికారతకు మనమంతా బాసటగా నిలుస్తూ బలమైన సమాజ నిర్మాణానికి మనవంతుగా ప్రయత్నం చేద్దామని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో హనుమకొండ రెడ్ క్రాస్ చైర్మన్ డాక్టర్ పి. విజయ్ చందర్ రెడ్డి, కోశాధికారి : బొమ్మినేని పాపిరెడ్డి, రాష్ట్ర పాలకవర్గ సభ్యులు ఈవీ శ్రీనివాస్ రావు, జిల్లా పాలకవర్గ సభ్యులు డాక్టర్ మాగంటి శేషుమాదవ్, పొట్లపెల్లి శ్రీనివాస్ రావు, డాక్టర్ హెచ్.సంధ్యారాణి, చెన్నమనేని జయశ్రీ, రెడ్ క్రాస్ సిబ్బంది పాల్గొన్నారు.

## సమాచార హక్కు చట్టం సాధన కమిటీ ఆధ్వర్యంలో..



**వరంగల్ వాయిస్, హైదరాబాద్ :** సమాచార హక్కు చట్టం సాధన కమిటీ జాతీయ కార్యాలయంలో సావిత్రీబాయి పూలే జయంతి వేడుకలను శుక్రవారం ఘనంగా నిర్వహించారు. సావిత్రిబాయి పూలే చిత్రపటానికి సమాచార హక్కు చట్టం సాధన కమిటీ వ్యవస్థాపక జాతీయ అధ్యక్షుడు డాక్టర్ చంటి ముదిరాజ్, రాష్ట్ర అధ్యక్షులు సూర స్రవంతి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా డాక్టర్ చంటి ముదిరాజ్ మాట్లాడుతూ సావిత్రీబాయి పూలే జయంతిని జనవరి 3న ఆమె గౌరవార్థం తెలంగాణ ప్రభుత్వం ఒక కీలక నిర్ణయం తీసుకోవడం, ఈ రోజును ఏటా "మహిళా ఉపాధ్యాయుల దినోత్సవం"గా జరుపుకోనున్నట్లు రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించడంపై హర్షం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మల్లం వెంకటేశం, తెలంగాణ మహిళా కార్యనిర్వాహక అధ్యక్షురాలు జి.ప్రియా రెడ్డి, రాష్ట్ర సంయుక్త కార్యదర్శి బత్తుల మహేష్ గౌడ్, గ్రేటర్ హైదరాబాద్ అధికార ప్రతినిధి రాసునూరి లక్ష్మణ్, రంగారెడ్డి జిల్లా ఉపాధ్యక్షులు ముచ్చర్ల మల్లేష్, బండారి రాజు, కల్పన తదితరులు పాల్గొన్నారు.

## మొదటి మహిళా ఉపాధ్యాయురాలు సావిత్రి పూలే



**వరంగల్ వాయిస్, తొర్రూరు :** బహుజన సమాజ్ పార్టీ అధ్వర్యంలో సావిత్రి భాయ్ పూలే జయంతి సందర్భంగా పాలకుర్తి మండల కేంద్రంలో ఘన నివాళి అర్పించారు. ఈ సందర్భంగా పార్టీ నియోజకవర్గ అధ్యక్షుడు ఈదునూరి ప్రసాద్ మాట్లాడుతూ మనుధర్మ శాస్త్రంతో మహిళలు కేవలం ఇంటికి పరిమితమైన రోజుల నుంచి నేడు డాక్టర్లు, ఇంజినీర్లు, పోలీస్ ఆఫీసర్లు, క్రికెటర్లు, లాయర్లు, బిజినెస్ ఉమెన్లుగా అన్ని రంగాల్లో రాణించగలుగుతున్నారంటే కారణం "పూలే దంపతుల" వల్లనే అని అన్నారు. ఎన్నో అవమానాలు ఎదుర్కొని భారత దేశంలో మహిళలకు చదువు చెప్పిన భారతదేశ మొట్టమొదటి మహిళా ఉపాధ్యాయురాలు తల్లి సావిత్రిబాయి పూలే అని కొనియాడారు. పీడిత ప్రజలు ముఖ్యంగా స్త్రీల విద్యాభివృద్ధికి కృషి చేసిన తొలితరం మహిళా ఉద్యమకారిణి అని గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గ ప్రధాన కార్యదర్శి చింత గణేష్, కార్యదర్శి చేరిపెల్లి కుమార్, తొర్రూరు మండల అధ్యక్షులు ఈదునూరి శ్రీకాంత్, మంగలపెల్లి శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

# బీసీల అభ్యున్నతే ప్రజా ప్రభుత్వ ధ్యేయం

**➲ ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి**

**వరంగల్ వాయిస్, కేయూ :** కాకతీయ యూనివర్సిటీ బీసీ విద్యార్థి సంఘం ఇంచార్జి ఆరేగంటి నాగరాజు గౌడ్ ఆధ్వర్యంలో నిర్వహించిన సావిత్రిబాయి పూలే జయంతి కేయూ ఎస్డీఎల్ సీ ప్రాంగణంలో నిర్వహించిన కార్యక్రమానికి వరంగల్ పశ్చిమ నియోజకవర్గ శాసనసభ్యుడు నాయిని రాజేందర్ రెడ్డి ముఖ్యఅతిథిగా విచ్చేశారు. మాట్లాడుతూ సావిత్రి బాయి పూలే జయంతిని పురస్కరించుకొని రాష్ట ప్రభుత్వం 'మహిళా ఉపాధ్యాయ దినోత్సవం'గా ప్రకటించినందుకు తెలంగాణ ప్రజలు గర్వపడాలని అన్నారు. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం బీసీల అభివృద్ధి కోసం పాటు పడుతుందని, ఎన్నకల ముందు ఇచ్చిన వాగ్దానం ప్రకారం బీసీ కుల గణన పూర్తి చేసి, బీసీలకు స్థానిక సంస్థలు 42శాతం రిజర్వేషన్లు ఇవ్వడానికి ప్రభుత్వం ముందుకు పోతుందన్నారు. బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు బైరి రవికృష్ణ మాట్లాడుతూ రాష్ట్ర ముఖ్యమంత్రి సావిత్రిబాయి పూలే జయంతి సందర్భంగా మహిళా ఉపాధ్యాయ దినోత్సవాన్ని ప్రకటించడం పట్ల బీసీ సమాజం హర్షం వ్యక్తం చేస్తున్నారని అన్నారు. ఈ కార్యక్రమంలో



కాకతీయ యూనివర్సిటీ రిజిస్టర్ మల్లారెడ్డి, బీసీ సెల్ డైరెక్టర్ ఆకుతోట శ్రీనివాస్ , బీసీ సంక్షేమ సంఘం వరంగల్ ఉమ్మడి జిల్లా అధ్యక్షులు వడ్లకొండ వేణుగోపాల్ గౌడ్, తెలంగాణ గౌడ సంఘం రాష్ట్ర అధ్యక్షులు బోనగాని యాదగిరి గౌడ్, కేయూ పాలకమండలి సభ్యులు డా.చిర్ర రాజు గౌడ్, బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర కార్యదర్శి బచ్చు ఆనందం, బీసీ సంక్షేమ సంఘం ఉపాధ్యక్షులు అశోక్ గౌడ్, రీసెర్చ్ స్కాలర్ సోమరాజు, బీసీ విద్యార్థి సంఘం కాకతీయ యూనివర్సిటీ అధ్యక్షులు శాగంటి సుమన్ రాజ్, మహిళా కన్వీనర్ జాహ్నవి, ఉపాధ్యక్షులు జిర్కపల్లి రత్నం, గణేష్, అజయ్ సింగ్, తరుణ్, కోశాధికారి రవితేజ, కార్యవర్గ సభ్యులు హర్షవర్ధన్, కోఆర్డినేటర్ వేణు, నితిన్ పాల్గొన్నారు.

## మహిళా సాధికారతకు కృషి

**వరంగల్ వాయిస్, కేయూ :** హనుమకొండలోని కాకతీయ విశ్వవిద్యాలయం లో భారత దేశ తొలి మహిళా ఉపాధ్యాయురాలు, ప్రముఖ సంఘ సేవకురాలు సావిత్రి బాయి పూలే జయంతిని పురస్కరించుకుని తెలంగాణ గంగపుత్ర సంఘం రాష్ట్ర కార్యదర్శి టుంగుటూరి రాజేష్ ఖన్నా గంగపుత్ర సావిత్రి బాయి పూలే విగ్రహనికి పూల మాల వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మహిళా సాధికారత కోసం ఎనలేని సేవలు అందించి ఆడపిల్లల చదువు కోసం నిరంతరము కృషి చేశారని కొనియడారు.




## ఘనంగా సావిత్రి పూలే జయంతి

**వరంగల్ వాయిస్, పర్వతగిరి :** సావిత్రీబాయి పూలే జయంతిని శుక్రవారం మండలంలోని అన్నారం పాఠశాలలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. పాఠశాల ప్రధానోపాధ్యాయులు చౌద సోమేశ్వర్ మాట్లాడుతూ మహిళల కోసం పూలే చేసిన సేవలను కొనియాడుతూ భారతదేశంలో మొట్టమొదటి మహిళా ఉపాధ్యాయురాలు, ఆధునిక స్త్రీవాది, మహిళా విద్య, కుల, లింగ వివక్ష నిర్మూలన కోసం ఎంతో కృషి చేశారని అన్నారు. ఆమెకు నివాళులు అర్పిస్తూ మహిళా ఉపాధ్యాయులకు జాతీయ మహిళా ఉపాధ్యాయ దినోత్సవ శుభాకాంక్షలు తెలియజేశారు. ఉపాధ్యాయులు బాబు, లావణ్య, శ్రీలత, గ్రామస్థులు రాజు, యాకాంబ్రం,యాకయ్య, మహేందర్, దయాకర్, విద్యార్థులు పాల్గొన్నారు.



## ఆదర్శ అంధుల పాఠశాలలో..




**వరంగల్ వాయిస్, వరంగల్ :** నగరంలోని 23వ డివిజన్ ఆటోనగర్ లోని ఆదర్శ అంధుల పాఠశాలలో భారతీయ తొలి మహిళా ఉపాధ్యాయురాలు సావిత్రిబాయి పూలే జయంతిని బీసీ తెలంగాణ బహుజన సంక్షేమ సంఘం వరంగల్ జిల్లా అధ్యక్షుడు కటకం విజయ్ కుమార్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా తెలంగాణ బీసీ బహుజన సంక్షేమ సంఘం రాష్ట్ర సలహాదారులు ఆకారపు మోహన్ పాల్గొని సావిత్రిబాయి పూలే చిత్రపటానికి పూలమాలలు వేసి విద్యార్థులకు బిస్కెట్ల పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో పిట్టల కృష్ణంరాజు, తుల గణేష్ పాల్గొన్నారు.

## మహానుభావుల త్యాగాలను మరువకూడదు



**వరంగల్ వాయిస్, వరంగల్ :** మహానుభావుల ఆశయాలను, చేసిన త్యాగాలను మరువకూడదని, సావిత్రి బా పూలే జయంతి రోజును మహిళా ఉపాధ్యాయ దినోత్సవం ప్రకటించడం అభినందనీయమని జానపద గిరిజన విజ్ఞాన పీఠం పీఠాధిపతి ప్రొఫెసర్ భూక్య బాబురావు అన్నారు. శుక్రవారం వరంగల్ హంటరోడ్డులోని జానపద గిరిజన విజ్ఞానపీఠంలో ప్రొఫెసర్ బాబురావు అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో సావిత్రి పూలే జయంతిని పురస్కరించుకుని పూలే చిత్రపటానికి పూలు సమర్పించి నివాళులర్పించారు. అసిస్టెంట్ ప్రొఫెసర్లు డా.శ్రీమంతుల దామోదర్, డా.చూరేపల్లి రవికుమార్, డా.బాసని సురేష్, అబ్బు గోపాల్ రెడ్డి, టెక్నికల్ అసిస్టెంట్ డా.గంపా సతీష్, సిబ్బంది పరావస్తు విజయలక్ష్మి, సునంద, అంజేయులు, అశోక్, కస్తూరిబాయి, విద్యార్థులు పాల్గొన్నారు.

# సావిత్రి పూలే జయంతిని జాతీయ ఉపాధ్యాయ దినోత్సవంగా జరపాలి

**➲ కేంద్ర ప్రభుత్వం నిర్ణయం తీసుకోవాలి**

**➲ ప్రముఖ న్యాయవాది కలకోటి మహేందర్**

**వరంగల్ వాయిస్, ఆత్మకూర్ :** మొట్టమొదటి మహిళా ఉపాధ్యాయురాలు సావిత్రిబాయి పూలే జయంతిని జాతీయ మహిళా ఉపాధ్యాయ దినోత్సవంగా జరపాలని కేంద్ర ప్రభుత్వాన్ని ప్రముఖ న్యాయవాది అసైన్డ్ భూమి సమితి (ఏబీఎస్) వ్యవస్థాపక అధ్యక్షుడు కలకోటి మహేందర్ డిమాండ్ చేశారు. శుక్రవారం ఆత్మకూరు మండల కేంద్రంలో ప్రముఖ సామాజిక ఉద్యమ నాయకుడు పెరుమాండ్ల శ్రీనివాస్ ఆధ్వర్యంలో సావిత్రిబాయి జయంతి సందర్భంగా పూలే దంపతుల చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన కలకోటి మహేందర్ మాట్లాడుతూ సమ సమాజం కోసం జీవితాంతం



పోరాడిన పూలే దంపతుల త్యాగం మరువలేనిదని కొనియాడారు. జనవరి 3న మహిళ ఉపాధ్యాయ దినోత్సవంగా ప్రకటించిన రాష్ట్ర ప్రభుత్వానికి ధన్యవాదాలు తెలుపుతున్నామని, మహిళా సమాజం సావిత్రిబాయిని ఆదర్శంగా తీసుకొని హక్కుల సాధనకు పోరాడాలని అన్నారు. ఈ కార్యక్రమంలో దళిత బహుజన ఫ్రంట్ (డీబీఎఫ్)జిల్లా అధ్యక్షుడు మాదాసి సురేష్, వార్డు సభ్యులు అర్షం రాజ్ కుమార్, నాయకులు మిర్యాల కుమార్, ఐలయ్య, మల్లేష్, రమేష్ పాల్గొన్నారు.

## సీపీని కలిసిన బొద్దిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి

**వరంగల్ వాయిస్, హనుమకొండ :** వరంగల్ పోలీసు కమిషనర్ అంబర్ కిశోర్ ఝూను శుక్రవారం ఏఐసీసీ సభ్యుడు, సీనియర్ కాంగ్రెసు నాయకుడు బొద్దిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి మర్యాదపూర్వకంగా కలిసి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు.



## యువజన కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడికి పుట్టినరోజు శుభాకాంక్షలు

### భూక్య విజయేందర్ నాయక్



**వరంగల్ వాయిస్, పర్వతగిరి :** వర్ధన్నపేట నియోజకవర్గ శాసనసభ్యుడు కేఆర్ నాగరాజు కుమారుడైన యువజన కాంగ్రెస్ జిల్లా అధ్యక్షులు దిలీప్ రాజ్ పుట్టినరోజు సందర్భంగా యూత్ కాంగ్రెస్ వర్ధన్నపేట నియోజకవర్గ అసెంబ్లీ జనరల్ సెక్రటరీ భూక్య విజయేందర్ నాయక్ శుభాకాంక్షలు తెలియజేశారు. తమ నాయకుడి ఆధ్వర్యంలో జిల్లా యువజన కాంగ్రెస్ పార్టీ ముందంజలో దూసుకుపోతుందని ఈ సందర్భంగా కొనియాడారు. ఈ కార్యక్రమంలో మండల యూత్ నాయకులు పాల్గొన్నారు.

## టేకుమట్ల నూతన ప్రెస్ క్లబ్ ఎన్నిక

**అధ్యక్షుడిగా బొంగోని నరేష్**



**వరంగల్ వాయిస్, టేకుమట్ల :** జయశంకర్ భూపాలపల్లి జిల్లా టేకుమట్ల మండల ప్రెస్ క్లబ్ నూతన కమిటీని శుక్రవారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. టేకుమట్ల మండల ప్రెస్ క్లబ్ అధ్యక్షుడిగా బొంగోని నరేష్ ను ఎన్నిక కాగా, ఉపాధ్యక్షుడిగా అంబుల కుమార్ యాదవ్, ప్రధాన కార్యదర్శి గొల్లపల్లి సంతోష్ గౌడ్, కోశాధికారి ఎడ్ల సురేష్ యాదవ్, కార్యదర్శి ఆకునూరి సతీష్ లను ఎన్నుకోవడం జరిగింది. ఈ సమావేశంలో అధ్యక్షుడు నరేష్ మాట్లాడుతూ మండల ప్రెస్ క్లబ్ కోసం నిరంతరం కృషి చేస్తానని అన్నారు. జర్నలిస్టుల సమస్యల పరిష్కారానికి నిరంతరం పాటుపడుతామని పేర్కొన్నారు. ఈ సమావేశంలో కార్యవర్గ సభ్యులు రాజేందర్, సుంకరపల్లి దేవేందర్, కన్నూరి రమేశ్, మేడిపల్లి నరేష్, కూకట్ల దేవేందర్, రొంటాల సురేష్, కుమార్ పాల్గొన్నారు.

## మహిళా ఉపాధ్యాయులకు సన్మానం

**వరంగల్ వాయిస్, ఖిలా వరంగల్ :** వరంగల్, ఖిలా వరంగల్ మండలాల్లో పనిచేస్తున్న సోషల్ స్టడీస్ స్కూల్ అసిస్టెంట్స్ మహిళా ఉపాధ్యాయులను ఉర్సు సోషల్ కాంప్లెక్స్ సోషల్ ఫోరం వారు శుక్రవారం సాయంత్రం ఘనంగా సన్మానించారు. సావిత్రిబాయి పూలే జయంతిని పురస్కరించుకుని తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిన మహిళ ఉపాధ్యాయ దినోత్సవ సందర్భంగా ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. సన్మానం పొందిన మహిళ ఉపాధ్యాయులలో చంద్రకళ, శోభారాణి, చంద్రకళ, వెంకట్రాజమ్మ, కళావతి, సంధ్యారాణి, నిర్మల, భారతి, రాజకుమారి ఉన్నారు. ఆ పాఠశాల ప్రధానోపాధ్యాయుడు ధరావత్ పోచారం అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో ఉర్సు సోషల్ కాంప్లెక్స్ సోషల్ పురం గౌరవాధ్యక్షులు ఎం భూపాల్, అధ్యక్షులు పెరుమాండ్ల సాంబమూర్తి, ప్రధాన కార్యదర్శి ఎం. భిక్షపతి, కోశాధికారి రంగాచారి, సెక్రటరీ కే. శ్రీనివాస్ రెడ్డి, ఆర్గనైజర్ సంపత్, ఆడెపు భిక్షపతి, గులాబ్ సింగ్, ఆకుతోట శ్రీనివాస్, స్వామి పాల్గొన్నారు.



## మృతురాలి కుటుంబానికి ఆర్థిక సాయం



**వరంగల్ వాయిస్, భూపాలపల్లి :** భూపాలపల్లి జిల్లా భూపాలపల్లి మండలం నాగారం గ్రామానికి చెందిన నిరుపేద దళిత సామాజిక వర్గానికి చెందిన మోతే ఐలమ్మ(50) ఇటీవల అనారోగ్యంతో మరణించగా శుక్రవారం దళిత బహుజన ఫ్రంట్ (డీబీఎఫ్) జిల్లా అధ్యక్షుడు మాదాసి సురేష్ ఆధ్వర్యంలో ప్రముఖ న్యాయవాది అసైన్డ్ భూమి సమితి (ఏబీఎస్) వ్యవస్థాపక అధ్యక్షుడు కలకోటి మహేందర్ పరామర్శించారు. ఈ సందర్భంగా మృతురాలి కుటుంబ సభ్యులకు రూ.4000ల ఆర్థిక సహాయం అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ బాధిత కుటుంబానికి ఎల్లవేళలా అండగా ఉంటామని తెలిపారు. ఈ కార్యక్రమంలో దళిత సంఘాల నాయకులు మాదాసి శ్రీనివాస్, గిన్నారపు మైబు, మాదాసి సుదర్శన్, మాదాసి సుధాకర్, మృతురాలి కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

## క్యాలెండర్ ఆవిష్కరణ



**వరంగల్ వాయిస్, హనుమకొండ :** తెలంగాణ పంచాయత్ రాజ్ మినిస్టీరియల్ ఉద్యోగుల సంఘం హనుమకొండ జిల్లా 2025 క్యాలెండర్ ను శుక్రవారం హనుమకొండ జిల్లా కలెక్టర్, జిల్లా ప్రజా పరిషత్ ప్రత్యేకాధికారిణి పి.ప్రావీణ్య కలెక్టర్ కార్యాలయ సమావేశ మందిరములో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా పంచాయతీ రాజ్ మినిస్టిరియల్ ఉద్యోగులకు నూతన సంవత్సర శుభాకాంక్షలు కలెక్టర్ తెలియజేశారు. జిల్లా ప్రజా పరిషత్ హనుకొండ ముఖ్య కార్యనిర్వాహణాధికారి ఎం.విద్యాలత పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో అధ్యక్షులు కోడం రవి ప్రకాష్, ప్రధాన కార్యదర్శి చాట్ల రవికుమార్, ఉపాధ్యక్షులు జి.సునీల్ కుమార్, జాయింట్ సెక్రటరీలు, వి.పల్లవి, జి.రమేష్, కోశాధికారి ఎండీ కాజా ఇక్బాల్, ఆర్గనైజింగ్ కార్యదర్శిలు ఎం.కరుణ కుమారి, సీహెచ్ వేణుగోపాల్, రాష్ట్ర కౌన్సిలర్లు డి.ప్రవీణ్, పి.జయరాం, ఈసీ మెంబర్లు కె.శ్రీనివాసరావు, ఎండీ అబ్దుల్ రఫీక్, ఈ భాగ్యమ్మ, డీఆర్డీఏ ఏఓ శ్రీనివాస్ రెడ్డి, డీఆర్డీఏ పర్యవేక్షకులు శ్రీనివాస స్వామి, ఇందిర తదితరులు పాల్గొన్నారు.

## నిరుపేదలకు దుప్పట్లు పంపిణీ



**వరంగల్ వాయిస్, వరంగల్ :** నేటి రోజులలో చలి నుండి రక్షణ లేక నిరు పేదలు ఇబ్బందులు పడుచున్నారని గ్రహించి సొంత డబ్బులతో కొనుగోలు చేసి దానం చేయడం ఎంతో గొప్పతనం విషయమని బీఆర్ఎస్ లీడర్ మరుపల్ల గౌతమ్ అన్నారు. డీకే నగర్ లో దాత అయిన శోభా రాణి శుక్రవారం మరుపల్ల గౌతమ్ ఆధ్వర్యంలో 20 మంది నిరుపేదలకు దుప్పట్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో డీకే నగర్ కాలనీ వాసులు కుండే రాజు, టం టం నరసింహ, దాసరి రాజు, వంగరి సర్వేషాం, పిట్ట హరి, తదితరులు పాల్గొన్నారు.

## పాత కలెక్టర్ క్యాంప్ కార్యాలయం పరిశీలన

**వరంగల్ వాయిస్, హనుమకొండ :** సుబేదారిలోని పాత కలెక్టర్ క్యాంప్ కార్యాలయాన్ని వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి, కుడా చైర్మన్ వినగల వెంకట్రాంరెడ్డి, జిల్లా కలెక్టర్ ప్రావీణ్య, జీడబ్ల్యూఎంసీ కమిషనర్ అశ్విని తానాజీ వాకడే శుక్రవారం పరిశీలించారు. కార్యాలయంతో పాటు చుట్టూ ఉన్న పరిసరాలను ఎమ్మెల్యే తదితరులు పరిశీలించారు. పాత కలెక్టర్ క్యాంప్ కార్యాలయ భవనాన్ని మరమ్మతు పనులు చేయించి అందుబాటులోకి తీసుకురావడానికి గల అవకాశాలను గురించి అధికారులతో ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి చర్చించారు. కుడా పీవో అజిత్ రెడ్డి, ఈఈ భీమ్ రావు, అధికారులు పాల్గొన్నారు.

# సేవకు పదవి అక్కరలేదు

◆ సొంత డబ్బుతో రోడ్డు వేయించిన యువకుడు
◆ పలువురికి ఆదర్శంగా నిలిచిన తిరుపతి



**వరంగల్ వాయిస్, పర్వతగిరి :** గ్రామంపై ప్రేమ, గ్రామానికి ఏదైనా చేయాలనే సంకల్పం ఉంటే చాలు పదవి అవసరం లేదని ఆ యువకుడు నిరూపించాడు. సొంత జేబులో నుంచి డబ్బులు ఖర్చు చేసి గ్రామంలోని బురద రోడ్డుకు మరమ్మత్తులు చేయించి అందరికీ ఆదర్శంగా నిలిచాడు. పర్వతగిరి మండలంలోని దూప తండా గ్రామ పంచాయతీ పరిధిలోని రైతులు పొలాలు, చెలకలకు వెళ్లడానికి కాలి బాట గుంతలమయంతో పాటు, బురదమయంగా ఉండేది. తండాలోని రైతులు తమ పొలాలకు వెళ్లాలంటే మోకాళ్ల లోతు బురదలో నుండి వెళ్లాల్సిందే. ప్రభుత్వాలు మారినా గ్రామంలోని రోడ్డు మాత్రం మారడం లేదని గ్రామస్తులు ఆవేదన చెందే వారు. సేవ దృక్పథం ఉన్న గ్రామ యువకుడు ధర్మసోత్ తిరుపతి తన గ్రామంపై ఉన్న ప్రేమతో ప్రత్యేక



అధికారుల పాలన కొనసాగుతున్నప్పటికీ తన సొంత డబ్బులతో బురద మయంగా ఉన్న రోడ్డుకు జేసీబీ సాయంతో ఇరువైపులా నుంచి మట్టి తీయించి కొత్త రోడ్డును నిర్మించాడు. రైతులకు సరిపడా 20 ఫీట్ల వెడల్పుతో ఒక కిలో మీటర్ దూరం వరకు రోడ్డు నిర్మాణం చేపట్టాడు. ప్రజల సంక్షేమం కోసం తన గ్రామ అభివృద్ధి కొరకు రానున్న రోజుల్లో కూడా ముందుండి గ్రామానికి సహాయ సహకారాలు అందిస్తానని తిరుపతి పేర్కొన్నాడు. ఈ సందర్భంగా ఆ యువకుడ్ని పలువురు గ్రామ ప్రజలు తిరుపతి గ్రామానికి చేస్తున్న సేవను గుర్తించి అభినందిస్తూ కృతజ్ఞతలు తెలియజేస్తున్నారు.



# ఏఎన్ఎం పోస్టుల సంఖ్యను పెంచాలి

● ఆరోగ్యశాఖ మంత్రికి ఏఐటీయూసీ వినతి



**వరంగల్ వాయిస్, హైదరాబాద్ :** మల్టీపర్పస్ హెల్త్ అసిస్టెంట్ (ఫిమేల్) పోస్టులకు రాష్ట్ర ప్రభుత్వం నిర్వహించిన పరీక్షలో వెల్లడించిన పోస్టులకు అదనంగా పోస్టులను పెంచాలని, త ద్వారా వైద్య ఆరోగ్యశాఖలో గత 18 సంవత్సరాలుగా పనిచేయుచున్న రెండవ ఏఎన్ఎంలకు న్యాయం జరుగుతుందన్నారు. ఎక్కువ మందికి రెండవ ఏఎన్ఎంలకు ఉద్యోగం అవకాశం వస్తుందని అందుకు రాష్ట్ర ప్రభుత్వం ప్రయత్నించి ఎక్కువ పోస్టులను మంజూరు చేయాలని తెలంగాణ రాష్ట్ర సెకండియర్ యూనియన్ (ఏటీయూసీ) ఆధ్వర్యంలో నేడు వైద్య ఆరోగ్య కుటుంబ సంక్షేమ శాఖ మంత్రి దామోదర రాజనర్సింహను కలిసి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఏఐటీయూసీ రాష్ట్ర ఉప ప్రధాన కార్యదర్శి ఎం.నరసింహ మంత్రికి వివరిస్తూ దాదాపు 5000 మంది రెండవ ఏఎన్ఎంలు రాష్ట్రంలో గత 18 సంవత్సరాలుగా తమ సేవలను ప్రభుత్వానికి, ప్రజలకు అందిస్తున్నారని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం మరిన్ని ఎక్కువ పోస్టులను పెంచడం ద్వారా వీరికి అర్హత పరీక్షలో ఉద్యోగావకాశాలు ఏర్పడుతాయని వారు తెలియజేశారు. వయోపరిమితి వలన పరీక్షకు అర్హత లేని వారికి గతంలో ఏర్పాటు చేసిన త్రిసభ్య కమిటీ ప్రకారం 100శాతం గ్యాస్ శాలరీ ఇవ్వాలని, 10 లక్షల రిటర్మెంట్ బెనిఫిట్, 10 లక్షల హెల్త్ ఇన్సూరెన్స్, 10 లక్షల లైఫ్ ఇన్సూరెన్స్ లను అమలు చేయాలని వారు కోరారు. దీనిపై మంత్రి స్పందిస్తూ వీలైనన్ని ఎక్కువ పోస్టులను విడుదల చేయడానికి ప్రయత్నిస్తామని, అధికారులతో రిపోర్టు తెప్పించుకొని ఖాళీ పోస్టులన్నింటిని నియమిస్తామని వారు యూనియన్ ప్రతినిధులకు హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో రెండవ ఏఎన్ఎంల యూనియన్ రాష్ట్ర గౌరవ అధ్యక్షులు తోట రామాంజనేయులు, రాష్ట్ర అధ్యక్షురాలు జే.పద్మ, ప్రధాన కార్యదర్శి శ్యామల, సహాయ కార్యదర్శి తన్వీర్ సుల్తానా, సువర్ణ, సుమిత్ర, భాగ్య, పద్మ తదితరులు పాల్గొన్నారు.

# పద్మజ్యోతి పరపతి సంఘం నూతన కమిటీ ఎన్నిక

◆ మరోసారి అధ్యక్షుడిగా చిప్ప వెంకటేశ్వర్లు



**వరంగల్ వాయిస్, కొత్తవాడ :** పద్మజ్యోతి పరస్పర సహాయక సహకార పరపతి సంఘం లి., కొత్తవాడ, మట్టెవాడ 38వ మహాసభ కొత్తవాడలోని పద్మశాలి వెల్ఫేర్ ట్రస్ట్ భవన్ లో శుక్రవారం జరుగగా సభాధ్యక్షుడిగా చిప్ప వెంకటేశ్వర్లు వ్యవహరించారు. ముందుగా మార్కండేయ మహర్షి చిత్రపటానికి పూలమాల వేసి జ్యోతి ప్రజ్వలన చేశారు. 2024 సంవత్సరపు ఆదాయ వ్యయాలు చదివి సభ్యులకు వినిపించి ఆమోదించారు. మరణించిన సభ్యులకు గతంలో దహన సంస్కారాలకు రూ.15,000 వేలుగా ఉండగా రూ.20,000 వేలకు పెంచుతూ తీర్మానం చేసి ఆమోదించారు. తదనంతరం నూతన కమిటీ ఎన్నికకు ఎలక్షన్ ఆఫీసర్లుగా పంతగాని శ్రీనివాస్, మంత్రి లింగమూర్తి వ్యవహరించగా అధిక మెజారిటీతో చిప్ప వెంకటేశ్వర్లు నేత తిరిగి అధ్యక్షుడిగా ఎన్నికయ్యారు. ఉపాధ్యక్షులుగా అడిగొప్పుల సంపత్, దాసరి భాస్కర్, కార్యదర్శిగా వలుస వెంకటస్వామి, సహాయ కార్యదర్శిగా ఆడెపు రవి, కోశాధికారిగా పోరండ్ల సాంబయ్య, సహాయ కోశాధికారిగా కూచన లక్ష్మి నారాయణ, డైరెక్టర్లుగా పోరండ్ల సతీష్, కూచన రాములు, ముంద్రాతి వెంకటేశ్వర్లు, తాటిపాముల స్రవంతి, గజ్జెల కావ్య ఎన్నిక కావడం జరిగింది. 2025-26 సంవత్సరానికి ఈ కమిటీ తమ కార్యకలాపాలు నిర్వహిస్తూ సభ్యుల సంక్షేమానికి పాటుపడతామని అధ్యక్షులు చిప్ప వెంకటేశ్వర్లు నేత తెలిపారు. తమను ఎన్నుకున్న సభ్యులకు ఈ సందర్భంగా కృతజ్ఞతలు తెలియజేశారు.

వరంగల్ వాయిస్ Evening Daily
GRATER WARANGAL
Hanamkonda | Mahabubabad | Jangaon | Dornakal
Bhupalapaly | Mulugu | Parakala | Narsampet
Station Ghanpur | Palakurthy | Waradannapet
శుక్రవారం, జనవరి 03, 2025



**ఓరుగల్లులో ఆకారపు వారి కుటుంబం అంటేనే నిస్వార్థ సేవకు ప్రతిరూపం. సొంత ఆస్తులను దానం చేసి, ధార్మిక సంస్థలను నిర్మించిన ఘన చరిత్ర వారికుంది. ఆ ప్రముఖుల కుటుంబంనుంచి పుట్టుకొచ్చిన మరో గొప్ప వ్యక్తి ఆకారపు హరీష్ కుమార్ గుప్త. 'పరోపకారం ఇదం శరీరం' అన్న ధర్మ సూత్రాన్ని తెలిసిన ఆయన వ్యాపార రంగంలో, దానధర్మాల విషయంలో విజ్ఞతతో వ్యవహరిస్తూ.. పూర్వికుల దయా గుణాన్ని,సేవా భావాన్ని కొనసాగిస్తున్నారు. ఆకారపు వారి కుటుంబానికి చెందిన బహుముఖ ప్రజ్ఞాశాలి.. ఉన్నత విద్యావంతుడు ఆకారపు హరీష్ కుమార్ గుప్త పై వరంగల్ వాయిస్ స్ఫూర్తిదాయక కథనం..**

- **జనహితం.. ఆయన అభిమతం**
- **సేవకు ప్రతిరూపం..**
- **దానధర్మాలకు పెట్టింది పేరు**
- **వ్యాపార రంగంలోనూ అందెవేసిన చేయి**

గడ్డం కేశవమూర్తి



# సేవాదనుడు.. ఆకారపు హరీష్ కుమార్ గుప్త



**విశాల హృదయం, దయాగుణం కలిగిన ఆకారపు హరీష్ కుమార్ గుప్త జనహితం తన అభిమతం అంటూ ముందుకు సాగుతున్నారు. సేవా రంగంలో తనదైన ముద్ర వేస్తున్నారు. ప్రముఖ వ్యాపారవేత్తగా తనకంటూ ప్రత్యేక గుర్తింపును తెచ్చుకున్నారు. నిస్వార్థ సేవకు ప్రతిరూపంగా నిలుస్తున్నారు.**

## కుటుంబ నేపథ్యం..

వరంగల్ మహానగరంలో 1977 మే 2న ఆకారపు శరత్ చంద్రికా దేవి, రాజా చెన్న విశ్వేశ్వరరావు దంపతులకు హరీష్ కుమార్ గుప్త జన్మించారు. వీరిది దానధర్మాలకు చెందిన కుటుంబం. హరీష్.. సేంట్ గాబ్రియల్ హైస్కూల్ లో పదో తరగతి, ఎల్బీ కళాశాలలో ఇంటర్మీడియట్, సీకేఎం కళాశాలలో డిగ్రీ చదివారు. 1999లో కాకతీయ యూనివర్సిటీలో ఎంకామ్ పూర్తి చేశారు. క్రీడా రంగంలో ప్రావీణ్యం ఉన్న హరీష్ మంచి టేబుల్ టెన్నిస్ క్రీడాకారుడు. 1999 జులై 3 న హైదరాబాద్ కు చెందిన ఉన్నత విద్యావంతురాలు కొక్కొండ స్వాతిని వివాహం చేసుకున్నారు. వీరికి కుమారుడు రోహిత్ కుమార్, కూతురు రోహిణి చంద్రిక ఉన్నారు. ప్రస్తుతం వీరు ఉన్నత విద్య లభ్యసిస్తున్నారు. హరీష్, స్వాతి దంపతులు కుటుంబ పేరు ప్రతిష్టలను కాపాడుతూ పేదలకు అండగా నిలుస్తున్నారు. ముఖ్యంగా వీరి వద్ద పనిచేసే సహాయకులు అందరినీ కుటుంబ సభ్యులుగా చూస్తారు. వారి మేలు కోసం చేతనైన సహాయం చేస్తున్నారు.

## సేవకు ప్రతిరూపం..

సేవా తత్పరుడు ఆకారపు నర్సింగం గుప్త వారి కుమారుడు రాజా చిన్న విశ్వేశ్వరరావు పలు ధార్మిక సంస్థలను స్థాపించి అపారమైన సేవ చేశారు. ఉమ్మడి వరంగల్ జిల్లాలో వీరి పేరు వినని వారు ఉండరంటే అతిశయోక్తి కాదేమో. దాతృత్వంలో వీరికి వీరే సాటి. ప్రముఖంగా శ్రీ విశ్వేశ్వర సంస్కృతాంధ్ర కళాశాల, స్టేషన్ రోడ్డులోని కాశీ విశ్వేశ్వర ఆలయం, సత్రాలు కనిపిస్తాయి. కళాశాలలు, పాఠశాలలు, దేవాలయాలు, గ్రంథాలయాలు ఎంజీఎం ఆసుపత్రి నిర్మాణానికి పెద్ద మొత్తంలో విరాళం అందించారు. అంతేగాక మంచి నీటి బావులను తవ్వించి ఎంతో మంది దాహాన్ని తీర్చారు. అనంతలక్ష్మి ఆయుర్వేదిక్ కళాశాల, ఆకారపు శరత్ చంద్రికా మహిళా కళాశాల, కృష్ణ కళాశాల, రోటరీ క్లబ్బులకు భూదానం చేసిన మహానుభావులు వీరు. వారణాసి, తిరుపతి దేవస్థానాల్లో కూడా సత్రాలు నిర్మించి తమ సేవా నిరతిని చాటుకున్నారు.

## సేవే స్ఫూర్తి..

తాత ఆకారపు నరసింగంగుప్త, తండ్రి రాజా చెన్న విశ్వేశ్వరరావుల నుంచి దాన గుణాన్ని అలవర్చుకున్న హరీష్ కుమార్ గుప్త పూర్వికుల పుణ్య కార్యక్రమాలను నెరవేర్చడంలో ముందున్నారు. ఏకశిలా ఎడ్యుకేషన్ సొసైటీ అడిషనల్ కార్యదర్శిగా, వరంగల్ టేబుల్ టెన్నిస్ అసోసియేషన్ అధ్యక్షుడిగా, శ్రీ విశ్వేశ్వర సంస్కృతాంధ్ర కళాశాల ప్రెసిడెంటుగా, వరంగల్ క్లబ్ వ్యవస్థాపక సభ్యుడిగా అందరికీ అందుబాటులో ఉంటూ విశిష్ట సేవలు అందిస్తున్నారు. ఆకారపు నరసింగం శ్రేష్టి, అనంతలక్ష్మి, సుశీల దేవి, రాజా చెన్న విశ్వేశ్వరరావు, శరత్ చంద్రికా దేవిలచే ఏర్పాటు చేయబడిన విద్యాసంస్థలన్నింటినీ వారసుడు హరీష్ కుమార్ గుప్త ఆయన సతీమణి స్వాతి నిరాటకంగా కొనసాగిస్తున్నారు. తాత, నానమ్మ, తండ్రి, తల్లి బాటను అనుసరిస్తున్నారు. సేవా తత్పరులుగా కీర్తి గడించిన వారి పేరును చిరస్థాయిగా నిలబెట్టడంలో వీరు సఫలీకృతమయ్యారు. స్వాతి కూడా దానధర్మాలు చేయడంలో ముందున్నారు. ఏడాదిలో ఐదారుసార్లు వృద్ధాశ్రమాలు, వికలాంగుల సంక్షేమ కేంద్రాలు సందర్శిస్తూ ఉచిత సేవలు అందిస్తున్నారు.

## వ్యాపార రంగంలో దిట్ట..

కామర్స్ లో పోస్ట్ గ్రాడ్యుయేషన్ పూర్తి చేసిన ఆకారపు హరీష్ కుమార్ గుప్త వ్యాపార, వాణిజ్య రంగాల్లో దిట్ట. వరంగల్, హనుమకొండలో పెట్రోల్ పంపుల వ్యాపారం నిర్వహిస్తూ భారత్ పెట్రోలియం కార్పొరేషన్ డీలర్ గా ప్రత్యేక గుర్తింపు పొందారు. నిర్మాణరంగంలో ప్రవేశించి దానిని విస్తృత పరచాలన్న ఆశయంతో ముందుకెళ్తున్నారు. వ్యాపార, వాణిజ్య రంగాల్లో నియమ నిబంధనలు తూచా తప్పకుండా పాటిస్తూ ఓరుగల్లు మహానగరంలో ఉత్తమ వ్యాపారవేత్తగా పేరు గడించారు. హరీష్ కుమార్, ఆయన సతీమణి స్వాతి కూడా ధార్మిక బాటలోనే నడుస్తూ కళాశాలల అభివృద్ధికి ఎనలేని సేవలు అందిస్తున్నారు. వీరి నేతృత్వంలో నిర్వహించబడుతున్న అన్ని కళాశాలలకు ఆదాయ వనరులను సమకూర్చారు. మన సంస్కృతి సంప్రదాయాలను కూడా కాపాడడంలో వీరు ముందున్నారు. తమ ఇంటి ఇలవేల్పు కాశీ విశ్వేశ్వరుడి ఆశీస్సులతోనే ఉచిత సేవలు అందిస్తున్నట్లు ఆకారపు హరీష్, స్వాతి తెలిపారు.











# స్త్రీజాతి విముక్తి కోసం పోరాడి ధీరవనిత..
# సావిత్రీబాయి ఫూలే

- దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ
- స్వగృహంలో పుష్పాంజలి ఘటించిన మంత్రి

**వరంగల్ వాయిస్, వరంగల్ :** మహిళా సాధికారతకు పర్యాయపదం సావిత్రీబాయి పూలే అని దేవాదాయ, ధర్మాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ అన్నారు. సావిత్రీబాయి పూలే 194వ జయంతిని పురస్కరించుకుని హైదరాబాద్ జూబ్లిహిల్స్ లోని తన నివాసంలో మంత్రి కొండా సురేఖ పుష్పాంజలి ఘటించి, నివాళులర్పించారు. మహిళలపై తీవ్ర అణచివేత, వివక్ష కొనసాగుతున్న ఆ కాలంలోనే మహిళల విద్య కోసం, స్త్రీజాతి విముక్తి కోసం పోరాడి ధీరవనితగా పూలే అని కొనిడాయాడారు. అనాథ పిల్లలు, స్త్రీలకు శరణాలయాలు, ఆశ్రమాలు నెలకొల్పడంతో పాటు సాంఘిక దురాచారాల నిర్మూలనకు, సమాజ ఉద్ధరణకు తన జీవితాన్ని అర్పించిన త్యాగశీలిగా ఈ ప్రపంచం సావిత్రీబాయి పూలేని గుండెల్లో పెట్టుకుంటుందన్నారు. మహిళలకు స్వేచ్ఛ లభిస్తే ఈ ప్రపంచానికి బానిసత్వం నుంచి విముక్తి లభించినట్టేనని భావించిన కాంగ్రెస్ పార్టీ ఆది నుంచి వారికి సమాన అవకాశాలు, సాంఘిక, ఆర్థిక, రాజకీయ హక్కులను కల్పించేందుకు కట్టుదిట్టమైన కార్యాచరణను అమలు చేస్తున్నదని మంత్రి సురేఖ అన్నారు. కాంగ్రెస్ పార్టీ అవలంబించిన విధానాలే నేడు స్త్రీలు అన్ని రంగాల్లో రాణించేందుకు భూమికను ఏర్పరిచాయని స్పష్టం చేశారు. నేడు తెలంగాణ రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం మహిళల స్వయం సాధికారత దిశగా అమలు చేస్తున్న పథకాలు, కార్యక్రమాలు సత్ఫలితాలనిస్తున్నాయని వెల్లడించారు. సావిత్రిబాయి పూలే జయంతిని తెలంగాణ రాష్ట్రంలో మహిళా ఉపాధ్యాయుల దినోత్సవంగా జరపాలని సీఎం రేవంత్ రెడ్డి నిర్ణయించడం పట్ల మంత్రి సురేఖ హర్షం వ్యక్తం చేశారు. స్త్రీవాదం పట్ల, మహిళల అభ్యున్నతి పట్ల కాంగ్రెస్ ప్రభుత్వానికికున్న చిత్తశుద్ధికి ఇది నిదర్శనమన్నారు.



### మంత్రికి శుభాకాంక్షలు..

నూతన సంవత్సరాన్ని పురస్కరించుకుని సెక్రటేరియట్ లో అటవీ, పర్యావరణ శాఖ మంత్రి కొండా సురేఖను వారి కార్యాలయంలో పీసీసీఎఫ్ (హెచ్ఓఎఫ్ఎఫ్) ఆర్ఎం డోబ్రియాల్, పీసీసీఎఫ్ (వైల్డ్ లైఫ్) ఏలుసింగ్ మేరు, పీసీసీఎఫ్ (కంపా) సువర్ణ తదితరులు కలిసి శుభాకాంక్షలు తెలిపారు.

## కలెక్టరేట్ లో ఘనంగా పూలే జయంతి



**వరంగల్ వాయిస్, హనుమకొండ:** దేశంలోనే మొదటి మహిళా ఉపాధ్యాయురాలు, సంఘ సంస్కర్త సావిత్రిబాయి పూలే జయంతిని శుక్రవారం హనుమకొండ కలెక్టరేట్ లోని కాన్ఫరెన్స్ హాలులో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి ముఖ్యఅతిథిగా హాజరుకాగా హనుమకొండ కలెక్టర్ పి.ప్రావీణ్య, కుడా ఛైర్మన్ ఇనగాల వెంకట్రాంరెడ్డి, గ్రేటర్ వరంగల్ మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ అశ్విని తానాజీ వాకడే, హనుమకొండ ఆర్డీవో రాథోడ్ రమేష్, డీఈవో వాసంతి, మహిళా ఉపాధ్యాయులు, కలెక్టరేట్ ఉద్యోగులు, సిబ్బంది పాల్గొని సావిత్రిబాయి పూలే చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో భాగంగా జిల్లాలోని వివిధ పాఠశాలలకు చెందిన మహిళా ఉపాధ్యాయులను శాలువాలు, జ్ఞాపికలతో ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి, కలెక్టర్ తదితరులు ఘనంగా సన్మానించారు.

### వరంగల్ లో..

వరంగల్ జిల్లా కలెక్టర్ కాన్ఫరెన్స్ హాలులో శుక్రవారం విద్యా శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన సావిత్రిబాయి పూలే జయంతి వేడుకలలో కలెక్టర్ డాక్టర్ సత్య శారద పాల్గొని వారి చిత్ర పటానికి పులాల సమర్పించి నివాళులర్పించారు.



## విద్యతోనే స్త్రీ విముక్తి సాధ్యం

**వరంగల్ వాయిస్, డోర్నకల్ :** విద్యతోనే స్త్రీ విముక్తి సాధ్యమవుతుందని గ్రహించిన సావిత్రిబాయి, సాటి మహిళలను విద్యావంతులుగా తీర్చిదిద్దాలనే సంకల్పంతో బాలికల పాఠశాలను ప్రారంభించి మహిళా చైతన్యానికి బాటలు వేశారని, తద్వారా ఆధునిక భారతదేశంలో మొట్టమొదటి మహిళా ఉపాధ్యాయురాలిగా కీర్తి గడించారని ఎంఈఓ అంగోత్ లక్ష్మ, ఎస్సీ, ఎస్టీ టీచర్స్ యూనియన్ మండలాధ్యక్షులు తలారి విద్యాసాగర్ అన్నారు. జాతీయ మహిళ ఉపాధ్యాయ దినోత్సవంగా సందర్భంగా ప్రముఖ సంఘ సంస్కర్త సావిత్రిబాయి పూలే జయంతి వేడుకలను శుక్రవారం మండలంలోని వివిధ పాఠశాలలో ఘనంగా నిర్వహించారు. మండలంలోని బోద్రాయి తండా, మైనార్టీ స్కూల్, స్తానిక జడ్పీ స్కూల్ లో సావిత్రి బాయి పూలే చిత్రపటానికి పలువురు టీచర్ల పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనేక ఆంక్షలతో కూడిన నాటి సమాజంలోనూ తన భర్త జ్యోతిరావు పూలే ప్రోత్సాహంతో సావిత్రిబాయి చదువు నేర్చుకుని ఉపాధ్యాయురాలు అయ్యారని గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో టీచర్లు మాలతి, సమిత, అనిత, సునిత, శాంత, మంజులత, గ్రెసమ్మ తదితరలు పాల్గొన్నారు.

### కాశిబుగ్గలో..




కాశిబుగ్గలోని బిట్స్ అశ్మక ఉన్నత పాఠశాలలో సావిత్రిబాయి పూలే జయంతి వేడుకలను శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా బాలాజీ విద్యాసంస్థల చైర్మన్ డాక్టర్ రాజేంద్రప్రసాద్ రెడ్డి హాజరై సావిత్రిబాయి పూలే భారతదేశంలోనే మొదటి మహిళా ఉపాధ్యాయురాలని కొనియాడారు. ఆధునిక విద్య ద్వారానే స్త్రీ విముక్తి సాధ్యపడుతుందని, బలహీన వర్గాల అభ్యున్నతికి, స్త్రీల విద్యాభివృద్ధికి కృషి చేసిన తొలి తరం మహిళా ఉద్యమకారిణి అన్నారు. సంఘసంస్కర్త అని తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ఈ సంవత్సరం నుంచి సావిత్రిబాయి పూలే జయంతిని మహిళా ఉపాధ్యాయ దినోత్సవంగా జరుపుకోవాలని అధికారికంగా ప్రకటించారన్నారు. ఈ సందర్భంగా సావిత్రిబాయి పూలే చిత్రపటాన్ని పూలమాలతో అలంకరించి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం మహిళా ఉపాధ్యాయులను సత్కరించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్ సంతోష్,ఉపాధ్యాయ బృందం, విద్యార్థులు పాల్గొన్నారు.



## ఘనంగా మహిళా ఉపాధ్యాయ దినోత్సవం

**వరంగల్ వాయిస్, నడికూడ :** సావిత్రి బాయి పూలే జన్మదినాన్ని మహిళా ఉపాధ్యాయుల దినోత్సవంగా రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించడం హర్షణీయమని చర్లపల్లి ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయులు అచ్చ సుదర్శన్ అన్నారు. పాఠశాలలో రాష్ట్ర మహిళా ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా సావిత్రిబాయి పూలే చిత్రపటానికి ప్రధానోపాధ్యాయులు అచ్చ సుదర్శన్, ఉపాధ్యాయ బృందం పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. అనంతరం పాఠశాల ప్రాంగణంలో అంగన్వాడీ టీచర్ బీముడి లక్ష్మిని ఉపాధ్యాయులు ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులకు అచ్చ సుదర్శన్ బత్తుల రవీందర్, కంచ రాజు కుమార్, లకావత్ దేవా, తదితరులు పాల్గొన్నారు.

### మహబూబాబాద్ లో..





**వరంగల్ వాయిస్, మహబూబాబాద్ :** ప్రముఖ సంఘ సంస్కర్త సావిత్రిబాయి పూలే జయంతి వేడుకలను శుక్రవారం కలెక్టరేట్ లోని ప్రధాన సమావేశ మందిరం లో ఘనంగా నిర్వహించారు. జిల్లా కలెక్టర్ అద్వైత్ కుమార్ సింగ్, అదనపు కలెక్టర్ (రెవెన్యూ) కె.వీరబ్రహ్మచారి, ఇతర జిల్లా అధికారులు సావిత్రిబాయి చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో జిల్లా విద్యాశాఖ అధికారి రవీందర్ రెడ్డి, జిల్లా బీసీ సంక్షేమ శాఖ అధికారి నరసింహస్వామి, సీపీఓ సుబ్బారావు, జడ్పీ సీఈఓ పురుషోత్తం, డీహెచ్ఓ మరియన్న, డీపీఓ హరిప్రసాద్, కలెక్టరేట్ ఏఓ పవన్ కుమార్, పర్యవేక్షకులు మదన్ గోపాల్, భద్రకాళి, తదితరులు పాల్గొన్నారు.

### జిల్లా పోలీస్ కార్యాలయంలో..

సావిత్రిబాయి పూలే జయంతి సందర్భంగా జిల్లా పోలీస్ కార్యాలయంలో ఆమె చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ సుధీర్ రాంనాథ్ కేకన్ మాట్లాడుతూ.. ఆనాటి కాలంలోనే బాలికలకు ప్రత్యేక పాఠశాలలు ప్రారంభించిన సావిత్రిబాయి పూలే మొదటి మహిళా ఉపాధ్యాయురాలు అని వివరించారు. విద్యాభివృద్ధికి కృషి చేస్తూ మరోపక్క సంఘములో ఉన్న దురాచారాలను కూడా రూపుమాపుతూ సంఘసంస్కర్తగా నిలుస్తూ నేటి మహిళా ఉపాధ్యాయులకు ఆదర్శంగా నిలిచారని కొనియాడారు. ఈ కార్యక్రమంలో ఏఆర్ డీఎస్పీలు శ్రీనివాస్, విజయప్రతాప్, ఆర్ఐ భాస్కర్, సోములు, అధికారులు, డీపీఓ సిబ్బంది పాల్గొన్నారు.



### ఆరెల్లి బుచ్చయ్య పాఠశాలలో..

సావిత్రి భాయి పూలే జయంతి సందర్భంగా ఖిలా వరంగల్ లోని ఆరెల్లి బుచ్చయ్య ఉన్నత పాఠశాల, ప్రభుత్వ జూనియర్ కళాశాల సంయుక్తంగా కోటలోని ప్రభుత్వ పాఠశాలలో పని చేస్తున్న మహిళా ఉపాధ్యాయులను ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమానికి పాఠశాల ఇంచార్జి హెడమాస్టర్ శైలంద్ర కుమార్ అధ్యక్షత వహించగా సన్మాన గ్రహీతలు ఆరెల్లి బుచ్చయ్య పాఠశాల నుంచి శోభారాణి, బాలికల ప్రభుత్వ ఉన్నత పాఠశాల మధ్య కోట నుంచి సౌభాగ్య, ప్రాధమిక పాఠశాల, మధ్యకోట నుంచి లక్ష్మి, రాణి, ప్రభుత్వ జూనియర్ కళాశాల నుంచి రజిత, శుక్లంబరం పాల్గొన్నారు.

EDITED, PRINTED, PUBLISHED AND OWNED BY GADDAM KESHAVA MURTHY, PRINTED AT MANIKANTA GRAPHICS, H.NO.4-10-121, KUMARPALLY, HANAMKONDA, WARANGAL URBAN DISTRICT-506001, TELANGANA STATE, PUBLISHED AT H.NO. 4- 7-138/1, KUMARPALLY, HANAMKONDA, WARANGAL.-506001. WARANGAL URBAN DISTRICT, TELANGANA STATE.
EDITOR : GADDAM KESHAVA MURTHY. RNI NO: TELTEL/2021/80377, PHONE NO : 8008794162, MAIL ID : gaddamkeshavamurthy@gmail.com